


ప్రాతఃకాలం ఐదు గంటలవుతుంది

సుమారు ఒకటవ నంబరు 'పుష్పకం' విజయవాడ లక్ష్మీటాకీసు సెంటరునుండి 'బయలుదేరనా, వద్దా?' అన్నట్టు 'గుర్రు బుర్రు' మంటూ పెద్దగ యిష్టం లేనట్లు వింత వింత సంగీత ధ్వనుల్ని వెళ్ళగక్కుతూంది. విజయవాడ పౌరాగ్రేసరు లందరూ అక్కడి సిటీబస్సులను ముద్దు ముద్దుగ 'పుష్పకమ'ని పిలిచి సంతృప్తితో నిట్టూరుస్తుంటారు తమ చక్కని పోలికకు.

అలనాటి రావణ 'పుష్పకం'లో ఖాళీ అంటూ లేకపోవడం లేదట. అక్కడి సిటీ బస్సులుగూడ 'సేవ్‌డిజైన్'. ఇంకో పారూప్యంకూడ ఉంది. 'డిజైన్' లోపం

వల్ల, అసలు 'పుష్పకం' లాగా అవి ఆకాశయానానికి నోచుకోలేదు. కాని అంతమాత్రంచేత వచ్చిన నష్టం ఏమీ లేదు. ఆ లోపాన్ని చోదక శిఖామణులు అతి నేర్పుగ పరిష్కరించేశారు. తమ నిపుణతతో బస్సులను గాలిలోనే నడుపుతూ ప్రజల మన్ననల నందుకుంటూ ఉంటారు. అప్పు డప్పుడూ ధూపనైవేద్య సహితంగా పూజలుకూడ అందుకుంటూ ఉంటారు.

ఇలా డ్రైవరోత్తములు గాలిలోనే నడపడానికి ఒక ముఖ్య కారణముంది. అక్కడి మున్సిపాలిటీవారు ఒక విలక్షణ మైన రోడ్లను ఆ ఊరికి ప్రత్యేకంగా 'డిజైన్' చేయించారు, అన్ని ఊళ్లలాగే సాఫీగ తిన్నగా రోడ్లుంటే తమ ప్రత్యేకత దెబ్బ తింటుందని. అటువంటి రోడ్ల 'మీద' నడిచే వాహనాలు గుర్రపుస్వారీని అనుసరిస్తున్నట్లు చూచేవారికీ, ఎక్కిన వారికీ అనిపిస్తుంది. ఎక్కిన ప్రయాణికులు ప్రయాణం చేస్తున్నంతసేపూ రకరకాల విన్యాసాలు చేస్తూనే ఉంటారు. డ్రైవర్లు ఈ యాతనను తొలగించే ఉద్దేశ్యంతోనే వాయుచోదనం ప్రారంభించారన్నమాట.

యింకా కండక్టరు పానకాలు అయిపూ అజా లేదు. డ్రైవరు మస్తాన్ తన సీట్లో కూర్చుని చిరాకుగా పానకాలు రాకకై ఎదురు చూస్తున్నాడు. మాటి మాటికీ 'యాక్సిలరేటరు' నొక్కి ఇంజన్నెంతో రొప్పాతన పెడుతున్నాడు. స్వాతంత్ర్యోద్యమాన్ని కళ్లారా జూసిన 'ఫోర్డు' అది. ఇంకా సంఘ సేవ చేస్తూనే ఉంది. తుది శ్వాస వరకూ చేస్తుంది కూడా! తప్పదు మరి!

క్లీనరు సూర్యోదయం, బీడీ వెలిగించి, తను కూడ చిరాకు పడుతున్నట్లు, 'ఏంటబ్బ! యింత లేటు. రోజూ యిట్లాగే ఉందీయన యవ్వారం! ఇయ్యాల కలెక్షను సున్నే! మూడూ ముప్పయ్యారు యెల్లిందనుకుంటానే! యేవియ్యా మస్తానో?' అన్నాడు.

డ్రైవరు లేనపుడు కండక్టరు దగ్గిరా కండక్టరు లేనపుడు డ్రైవరు దగ్గిరా రెండోవాళ్ల మీద తనూ విసుక్కొని వాళ్లను ప్రసన్నుల్ని చేసుకుంటాడు సూర్యోదయం!

'సరే గానీ మస్తానూ! వో పావలా యియ్యవయా కాఫీ తాగొస్తాగనీ!' అంటూ గునిశాడు.

అంతలో పానకాలు దుర్గా కేఫ్ రోడ్డులో నుంచి వస్తూ మస్తాను కంట బడ్డాడు. 'అడుగో దొరగారు. ఆడొస్తుండాడనుకొంటే నువ్వు దూస్కుంటావ్రా, సూరిగా?' రొండో ట్రిప్పులో తాగుదువు గానీలే!' అంటూ 'క్లచ్' వదిలాడు. ఒక్కసారిగా కుదిపి ముందుకు దూకింది పుష్పకం. ఎగిరి అందులో ఎక్కేశాడు పానకాలు. ఆ యెగరడంలో భుజానున్న తోలు సంచిలోంచి అర్ధరూపాయి క్రింద బడింది. 'గుంట కాడి నక్క' లాగా యెదురు చూస్తున్న సూర్యోదయం దాన్నొక్క గంతులో అందుకుని, 'కాఫీ తాగొస్తానయా, పానకాలూ' అంటూ అప్పుడే స్పీడందుకున్న బస్సులోంచి నేర్పుగా దూకేశాడు.

'ఆ! అరెరే; సూర్యోదయంగా! నీకు బుద్ధి రాదురా, నిన్ను పగలగొయ్యా!' అనుకుంటూ బస్సులో ఉన్న నలుగురు ప్రయాణికులకూ టిక్కెట్లు చించాడు పానకాలు. మొదటి ట్రిప్పు అవడం మూలాన జనం లేరు. మొదటి రెండు ట్రిప్పులూ కలెక్షను తక్కువే? తరువాత మూడూ నాలుగు ట్రిప్పుల్నించీ అందుకుంటుంది. కాలేజీ పిల్లలూ, ఆఫీసుకు వెళ్లేవారూ, పల్లెటూళ్ల నుంచి పట్నానికి వచ్చేవాళ్లూ మొ. వారందరితో చాల హడావుడిగ ఉంటుంది పానకాలుకూ, సూరికీ!

పది గంటలకు మూడో ట్రిప్పులో గొల్లపూడి నుండి నిండుగ బయలుదేరింది పుష్పకం! సూర్యోదయం పుట్‌బోర్డు మీద అలవోకగ నిలబడి యెంగో విలాసం ఒలకబోస్తూ రాత్రి రెండోఆట చూసిన సినిమాలోని భంగిమలను అనుకరించడానికి పాట్లు పడుతున్నాడు.

ఇంతలో అతని అనుభూతులకు అంతరాయంగా మస్తాను హారను ఒకటే మోతగ కొట్టసాగాడు. సూర్యోదయం పుట్‌బోర్డు రాడ్ ఒకచేత్తో పట్టుకుని బాగా వంగి ముందుకు చూశాడు. దూరాన ఒక ముసలమ్మ రోడ్డుమధ్యలో వంగొని పేడ యెత్తుతున్నది తట్టలోకి. హారను వినబడినా దగ్గర కొచ్చేదాకా నిర్లక్ష్యంగా తనపనిలో మునిగిపోయింది. సూర్యోదయానికి మండిపోయింది. 'అసలే లేటయిందని యేడుస్తుంటే ఈ ముసలోళ్లు అడ్డం! నియ్యవ ఒక్కగుద్దు గుద్దిండంటె పచ్చడవు తావు' అనుకున్నాడు ముసలిదాన్ని దాటుతూండగ.

'ఏం తల్లీ యింటో అందరికీ చెప్పే వొచ్చావా' అన్నాడు. యింతలో చెక్‌పోస్టు చేరింది బసు.

'ఆ! శెకెపోస్టొచ్చారా బాబో ఎవరన్నా హోల్డాయిన్!' అనరిచాడు గొంతు చించుకుని. 'లేవ రావాలె తొందరగా, ఎవురిదయ్యా ఈ గంప? ఆ? దోవలో అడ్డంగా! నువ్వు రా తల్లీ, రామ్మా దిగావా? మా తల్లే! రాయిక్స్' అంటూ మస్తానుకు సిగ్నలిచ్చాడు.

'పానకాలో మూడు దినమ్!' అన్నాడు దిగినవాళ్లకు జీవత్వాన్ని ఆపాదిస్తూ!

'ఈ సారి ఒకటే యిచ్చు. అక్కడ మొగుడు కాచుక్కూర్చున్నాడు. ఒకటెక్కువైనా, యాభై రూపాయలు క్షవరం!' అంటూ ఆ భాషలోనే హెచ్చరించాడు పానకాలు. బరాజు దగ్గర చెకింగ్ యిన్‌స్పెక్టరు తనిఖీ చేస్తున్న సంగతి తెలియజేశాడు.

యింతలో పకీరుగూడెం వచ్చింది. పానకాలు,

'పకీరుగూడెం హోల్డాన్' అనరిచాడు. సూర్యోదయానికి చిర్రెత్తుకొచ్చింది. 'ఏంటయా పానకాలూ ఎప్పుడూ పకీరు గూడెం అంటావు? ఎన్నిసార్లు చెప్పాలయా నీకు? ఆ? సుతారంగ 'పకీరు నగర్' అనలేవంటయా'' అంటూ స్వాభిమానాన్ని ప్రకటించుకున్నాడు. ఎప్పట్నుంచో అందరికీ చెప్తూనే ఉన్నాడీ సంగతి! అయినా మామూలే! అసలు తన ఆదరించేవాళ్లు కనబడలేదు. దానికింత నెంతో చింతిస్తుంటాడు. అందరిలాగా తనపేటకూ సుందరమైన పేరుండాలని సూర్యోదయానికి వాళ్ల బావ యేసుపాదం ఇచ్చేవాడు! తరువాత బస్సు ఆపుండానే పద్దని వారించినా, వో నలుగురు మోటు మనుష్యులు ముందుప్రక్క ప్రేలాడసాగారు. సర్కస్ ఫీట్లు చేస్తూ...

'ఒరేయ్ సూరీ, ఆ ముద్దుల్ని పైన స్టూలులో దింపేసెయ్. తెలుసుగా. పైన చెకింగుంది.' అన్నాడు పానకాలు.

కానీ ఆ స్టాపుకంటె ముందుగానే వాళ్ల పాలిటి యమధర్మరాజా చెకింగు యిన్‌స్పెక్టరు రూపంలో దున్నపోతులాంటి తన 'ఎన్‌ఫీల్డు' మీద బస్సు ఆపమని చెయ్యి వూపుకుంటూ వచ్చాడు.

మస్తాన్ బ్రేకు వేస్తూ, హెచ్చరిస్తున్నట్లుగా, 'పానకాలూ' అని తమాషాగా పిలిచాడు. బస్సు ఆగింది. యిన్‌స్పెక్టరు వెనకనుంచి లోనికెళ్ళాడు. పానకాలు ఆయన వెనకే ఉన్నాడు. వెనక్కి తిరిగి చిత్ర ముఖంతో ఉన్న సూర్యోదయానికి సౌంజ్ఞ చేశాడేదో!

వెంటనే సూర్యోదయం బస్సు ముందు డోరు దగ్గరకు పరుగెత్తాడు. అక్కడ సీట్లు చేసిన నలుగురు మనుష్యుల్లో ఒకడు, 'ఎందుకయ్యా, ఆపేసినారూ? ఆరు నివడూ? ఓ క్రమగరా యేంది?' అనడిగాడు. సూర్యోదయానికి మండింది.

'కాదు కాదయ్యా. మా మొగుడు. తెల్సిందా? ఏం అట్టా చూస్తున్నావ్ నా మొహంలోకి? కోతులేమైనా ఆడుతున్నాయా? దిగవయ్యా ముందు. నువ్వు

# పుష్పక విమానం

కూడ నయ్యావ్! ఎక్కడికీ లోపలికి దూరతన్నావ్ మెల్లగా? దిగి, ఆ ముందుకెళ్ళి ఆగండి. తరవాతెక్కుదురు గానీ!' అన్నాడు. వాళ్ళు దిగిపోయారు. చెకింగు యిన్‌స్పెక్టరిదంతా చూడలేదు. లెక్క ఖచ్చితంగా ఉంది.

'హుఁ! హుఁ! కరెక్టు.' అని నిట్టూర్చాడు. గురి తప్పిన వేటగాడిలా!

బస్సు బయలుదేరింది. ముందు దిగిన నలుగురూ కాస్త దూరంగా ఆగారు. దగ్గరకు రాంగానే, 'ఆపండి. ఆపండి' అనరిచారు. సూర్యోదయం, 'ఏంటీ? మిమ్మల్ని మళ్ళీనా? పోరేలే యిక చెప్పే మాకు. పోండియ్యా నడిసి.' అంటూ కసిరాడు.

మార్కెట్టు దగ్గర దిగవలసిన వాళ్ళు ఉండడంతో ఆ ప్రక్కనే ఆపాడు మస్తాన్. ఇంతలో,

'ఎవరయ్యా కండక్టరు? ఇక్కడ ఆపకూడదని తెలీదూ? బస్సునెంబరెంత? ఆ? ముందిటు రా బసుదిగి!' అంటూ కానిస్టేబిలొకడు కవ్వింపు చర్యలతో కొల్పులు జరిపాడు. పానకాలు క్రిందికి దిగకుండానే, 'మీరా సార్! యిదిగో తీసుకోండి మీ సిగరెట్ పెట్టె. యిందాక ట్రిప్పులో తీసుకున్నాగ!' అని వో పెట్టె అందించాడు. అర్థం పర్థంలేని ఈ ప్రశ్నలూ, సమాధానాలు అంతుబట్టని ప్రయాణీకులు వింటూ ఉండగానే కానిస్టేబిలు అవతలికెళ్ళి పెట్టె తెరిచి అందులో ఉన్న రెండు రూపాయల నోటు ఎవ్వరికంటా బడకుండా జేబులో దోపేశాడు.

'ఇదిగో పానకాలూ! యివ్వాళ పెద్దయ్యగారి పెట్రోలింగు ఉందిగానీ యిక్కడ ఆపబోకు. పైన ఆపుకో! మరి నే వస్తా. చిన్నయ్యగా రబ్బాయిని డాక్టరుగారింటికి తీసుకెళ్ళాలి.'

ఇంతలో కూరగాయ లమ్మేసుకుని ఖాళీ గంపలతో స్త్రీలు రాసాగారు మార్కెట్టునుంచి. పానకాలొక్కసారిగా వాళ్ళను హడల గొట్టేశాడు.


'ఏమిటి! ఈ గంపలన్నీ బసులోకేనా? అమ్మా! యిదేమన్నా బస్సా, గూడ్సా! దిగండి, దిగండి,' అన్నాడు.

'బాబ్బాబు, ఎం డెక్కి పోతావుంది; మానాయనగా! కావాలంటే, వో పది పైసలుచ్చుకో అయ్యా ఎగ్రస్టు' అంటూ బతిమాలేదాకా వాళ్ళను దిగమంటూనే ఉన్నాడు పానకాలు. గంపకు పదిపైసల చొప్పున వసూలు చేశాడు.

'ఆ! ఎవరండీ టికేట్, ఇదేమిటయ్యా ఇరవైయిచ్చావ్ సెంటరుకు ఇరవైరెండు! ఇంకో రెండు పైసలివ్వు. ఏంటీ లేవా? బధుందా! యిటివ్వు! మూడుపైసలు దిగేటపుడు తీసుకో! జరుగు ముందుకు! ఊఁ! తొందరగ' అంటూ హడావుడిగా డీల్ చేశాడో పల్లెకారు మనిషిని.

చలువ కళ్ళజోడు లోంచి ఇతరుల కనుమానం రాకుండా వో నవయువతిని తాగేస్తున్నట్లు చూస్తున్న వో నవయువకు డిచ్చిన పదిపైసలు తీసుకొని 'రెండుపైసల్లేవుసార్! తరవాతడగండి' అంటూ సాగిపోయాడు' ఎనిమిదిపైసల టికెట్టిచ్చి. ఇంతలో రైల్వేస్టేషను వచ్చింది. జనం బిలబిల దిగుతున్నారు.

'సూరీ, టికెట్లుచూడు' అన్నాడు పానకాలు. కొందరు టికెట్లు కొనకుండా తప్పించుకొని దిగిపోతారటు వంటి బద మలో! మొత్తానికి ఇద్దరు దొరికారు.



'ఏవయ్యా మాకు చెంగేద్దామనే? నాయం ఉండాలయా!' అంటూ వాళ్లిచ్చిన పావలాబిళ్ల జేబులో వేసుకున్నాడు సూరి, పానకాలు తన్ను గమనించడం లేదని రూఢి చేసుకుంటానికి బస్సులోకి చూశాడు. అతను బిజీగా టిక్కెట్లు కోస్తున్నాడు.

బస్సు బయలుదేరింది. గాంధీనగరం మలుపు తిరగడంలో ఒక రిక్షావాడికి చావుదప్పి కన్ను లొట్టబోయింది.

'ఏం బాబో! బొందితోసహా యెళ్లి పోతావ్ కైలాసం! మాబండి కింద బడితే' అంటూ పరామర్శించాడు సూరి.

లక్ష్మీటాకీసు మలుపు తిరిగింది. జైహింద్ టాకీసు దాటింది ఇంతలో,

'యీవండోయ్! అందరూ గట్టిగా పట్టుకోండి!' అని సూరి గావుకేక విన్పించింది. అది ముగిసిందో లేదో 'ముసలి ఫోర్డు' వో చిన్నసైజు హైజంపు చేసింది. లోని జనమంతా రకరకాలుగ ఊగుళ్లూ, లాంగుజంపులూ, హైజంపులూ మొ విన్యాసాలు చేశారు. యువతుల ప్రక్కనే విల్చున్న యువకులు మహాప్రసాదం అనుకుని యెంతో సంతుష్టి చెందారా తోపులాటలో! విజయవాడలో రోడ్లను అడ్డంగా త్రవ్వడం పరిపాటే! ఆ తరువాత రోడ్డుకు సమమట్టంగా పూడ్చక పోవడమున్నూ అలవాటే! మస్తానెపుడూ జాగ్రత్తగానే ఉండేవాడక్కడ! కానీ మనస్సు బాగోక యివ్వాళ కాస్త పరధ్యానంగా ఉండడంతో బస్సంతా సర్కస్ చేయవలసొచ్చింది.

బస్సు బందరురోడ్డుమీద పోతూంది. పశువులాస్పత్రి దాటాక సూర్యోదయం వెనక్కుతిరిగి చూశాడు యథాలాపంగా. ఇంకేముందీ! మూడూ ముప్పయ్యారు శరవేగంతో దూసుకొచ్చేస్తూంది. యింకం లేదు దాటేస్తుంది.

'మస్తానో లాగిచ్చవయా! మూడూ ముప్పయారొచ్చేసిందఠ! నియ్యవ! చాతగానోళ్లంతా డ్రైవర్లైందు కవుతారయ్యా, పాపీ!' అని అరిచాడు.

దీనితో బసంతా ఒక్కసారి జలదరించి, గభుక్కున స్పీడందుకుని పోసాగింది వెనకబస్సుకు సైడివ్వకుండా!

మొగల్ రాజపురం దగ్గిర ఆగింది వోల్డు ఫోర్డు! సూర్యోదయం తెగ ఖంగారుపడి పోతున్నాడు.

'ఏవమ్మోయ్! రావమ్మా మాతల్లి! అంత వయ్యారవైతే యలా?'

'అయ్యో! ఉండబ్బాయ్! యేవిటలా ఖంగారు పెట్టేస్తావూ? దిగాలా మరే వన్నానా' అందా గజలక్ష్మి!

'ఇదిగో అట్టా మాటలు చెపితే లాభంలా! అవతల మూడూ ముప్పయ్యా రొచ్చేస్తోంది. ఇదిగో రైట్ చెప్పేస్తున్నా! ర్ ... ర్' అంటూ బెదిరించాడు.

'ఒచ్చే, ఒచ్చే ఉండయ్యా!' వీడెక్కడ రైట్ అంటాడోనని అని ఆవిడ ఖంగారుగ రాబోవడంతో ఎవరిక్రిందో ఇరుక్కుపోయిన ఆవిడ హవాయి చెప్పుకూ ఆవిడకూ ఋణం తీరిపోయింది. దాంతో ఆవిడ మరింత ఖంగారుపడిపోయింది.

'ఖరమ్మమ్మా తల్లీ ఖర్మ! నీ చెప్పుకో దణ్ణం! నీకో దణ్ణం! దిగు తల్లీ!' అంటూ ఆ చెప్పును వంగి తనే తీసి బయటికి కిటికీగుండా విసిరేశాడు.

'నాయనా! కండక్టరూ నా పైసా యిచ్చేస్తావూ' అంది యింకో ఆండాళమ్మ.

'నా చెప్పు! నా చెప్పు! పీడ జిమ్మడ! ఒకటే ఖంగారు!' అంది గజలక్ష్మమ్మ!

వీళ్లందరికీ సమాధానంగా 'రాయిక్షే' అన్నాడు పెద్దగా సూర్యోదయం! అయితే అప్పటికే తరుణం మించిపోయింది. మూడూ ముప్ఫయ్యారు క్రొత్త లేలేండు. క్షణంలో ఫోర్డును దాటేసి గాలితో తేలిపోసాగింది. కానీ, దాని డ్రైవరు సింహద్రిదాటిపోతూండగా నవ్విన హేళననవ్వు మస్తానుకు మగతనానికో మచ్చలాగ కనిపించింది. ఫలితంగా అతనికాలు యాక్సిలరేటరును అడుగంటా తొక్కింది.

పోలీసాఫీసు దగ్గర ఆగిన లేలేండును వోల్డు ఫోర్డు దాటుతూండగా దాంట్లోని జనమంతా ప్రక్కన విమానమేదన్నా కూలిపోతున్నదేమోనని ఖంగారుగా తలలు వంచి చూశారు. మస్తాను విజయగర్వంతో సింహాద్రికి చేయూపాడు. సూర్యోదయం బిగ్గరగ ఈల వేశాడు నోట్లో వ్రేలు పెట్టి.

వోల్డు ఫోర్డిట్లా బరితెగించి పోతూండగా చుట్టుప్రక్కల యిళ్లల్లోంచి జనం బయటికొచ్చి తలలు పైకెత్తి ఆకాశంలో వెదక సాగారు. కానీ అక్కడేమీ కనబడక క్రిందజూచి 'హోహో వోల్డ్ ఫోర్డా!' అనుకుని మళ్లీ యిళ్లల్లోకి వెళ్లిపోయారు. వో ముసలాయన యిదంతా తెలియక, తన చంకలోని గొడుగు గబగబ తెరిచి వేసుకుని, 'ఉరుముతూంది. వర్షమొస్తుందో ఏం పాడో!' అన్నాడు. కానీ క్షణంలో తన్ను దాటిపోయిన బస్సును జూసి 'హోరినీ బస్సుమోతా!' అనుకుంటూ గొడుగు మూసేశాడు.

వోల్డు ఫోర్డు పటమట సెంటరులో ఆగి రొప్పసాగింది దాహమయినట్లు. సూర్యోదయం దాని మనస్సెరిగి వేగిరంగా దూకి, హోటల్లోదూరి, డబ్బాతో నీళ్లు తెచ్చి యింజను గొంతులో పోశాడు. పోస్తూ, 'అడికి సైడియ్యమాక! ఇస్తే మన కందదు! యిట్టాగే లాగిచ్చు మస్తానో!' అన్నాడు.

మొత్తానికి పోరంకి పోస్టు చేరింది ముందు. సూర్యోదయం సూచన అక్షరాల

**ఇది మీకు తెలుసా!**

### పండ్లు

పండ్లు రకరకాలు వాడాలి.

పండ్లు కోసి కాకుండా ఏకంగా తినాలి. తాజావి తినాలి. పండుతో పాటు దాని తొక్క కొంచెం తినాలి.

పండ్లకి ఎప్పుడూ ఉప్పు చక్కెర చేర్చకూడదు.

ప్రతి భోజనం చివరా ఏదో ఒక పండు తినాలి.

పండ్లు పిల్లని పండనివ్వాలి.

దేశవాళీ పండు ఫలాలు శ్రేష్టం.

—కె. రా.

అమలు చేశాడు మస్తాను మరి. బస్సెగ్గగానే పానకాలు హోటల్లో దూరి తెగిన టిక్కెట్లకు సరిపోను డబ్బు వేరుగ తీసి మిగతాది జేబులో పెట్టుకున్నాడు. ఇంకో క్షణం ఆలోచించి, ఇంకో ఇరవై తీసి జేబులో పెట్టుకున్నాడు. కలెక్షను అందివ్వడానికి మేనేజరుగారింటికి బయలుదేరాడు. ఆయన ఎదురు చూస్తూనే ఉన్నాడు రోజూలాగానే డబ్బు లెక్కజూసుకొని,

'ఏమిరా! కలెక్షను తగ్గిందే, ఎంత పంచుకున్నార్రా అంతా కూడ బలుక్కుని! లేకపోతే నువ్వొక్కడివే దిగమింగుతున్నావా? పానకాల స్వామిపేరు నిలుపుతున్నావ్‌రా! నిన్ను కొయ్యా!'

'చ, ఛా! అదేం లేదండి! ఇంజనాయిలు మార్పించడానికీ, పోలీసోడికీ, చెకింగాడికీ మొత్తం ఇరవై ఇచ్చా! మిగిలింది మీకిచ్చా!'

'మూడు మూణ్నాళ్ళకీ యింజనాయిలు మార్పించానని మస్కా కొడతున్నావ్! బిల్లూ లేదూ నీ బొందా లేదూ! ఎప్పుడో కుక్కను కాల్చినట్లు కాల్చేస్తా!'

'ఎక్కడో జారి పోయిందండి.'

'ఎప్పుడో నీ గూడకూడా జారిపోతుందిరా'

'హో ఇరవై కావాలయ్యా! బియ్యం కొనాలి!'

'బియ్యం లేకపోతే ఎక్కడన్నా కన్నం వెయ్యరా! ఇడియట్!' అంటూనే ఇరవై యిచ్చాడు, వోనరుగారు. పానకాలు గబగబా బస్సువైపు నడవసాగడు.

'ఒట్టి గొడ్డుకు అరుపు లెక్కువనీ,' అట్లాగే కయ్, కయ్యి మంటాడు. ఆ! మనం పట్టించుకుంటేగా! ఆయన అరుపులు ఆయనకీ, మనకరుకులు మనకి! చిల్లర పైసలు తిరిగి యివ్వకుండా దాచేసినదీ, టిక్కెట్లు కొయ్యకుండా డబ్బులు వసూలు చేసిన బాపతూ, గంపలకి ఎక్స్ట్రా వసూలు బాపతూ మొత్తం వో నాలుగూ ఇరవై ఉంది. వోనరుగారికి మస్కాద్వారా ఇరవై! ఆయన యిచ్చినది ఇరవై! ఇవ్వాళ యెవడి మొహం చూశానో మరి!' అనుకున్నాడు పానకాలు.

మస్తాను స్టీరింగుమీద తలవాల్చి చిన్న పైజా కునుకు తీస్తున్నాడు. బస్సులోని సీట్లన్నీ నిండి పోయాయి. టిక్కెట్లిచ్చేసి సిగ్నల్‌గా ప్రక్కరేకుమీద తమా ప్రయోగించాడు పానకాలు.

మస్తాను సెల్ఫ్ స్టార్టరు నొక్కాడు. 'గుర్...గుర్రు' మంది ఫోర్డు. అంతేగానీ నిద్రలేవడానికి మాత్రం ఒప్పుకోలా!

మళ్లీ నొక్కాడు. 'బుర్ ... బుర్రు' మందీసారి. 'సారీ మస్తాన్ భాయ్ మత్తుగా వుంది! వదుకోనియ్యబ్బా!' అన్నట్లు.

అవతల లేలేండ్లలో జనం నిండలేదు. ఇదే సమయం, వెళ్ళిపోవాలి వేంటనే!

'రేయ్ నా ర్యోదయం గా! కాస్త తోయ్‌మను.' యిక లాభం లేదని ఒక్కసారి మత్తంతా వదిలిపోయేట్టు జలదరించి ఫోర్డు పరుగందుకుంది. నాలుగైదు ఫర్లాంగుల తరువాత లేలెండు తనవెనుకే రావడం మస్తాను చూశాడు. మళ్లీ మొదలు! 'పాడిందే పాడరా పాచిపళ్ల దాసరీ!' అన్నట్లు.

కానీ లేలేండు ఈ సారి క్షమించలేకపోయింది. అతి స్పీడుగ ప్రక్కనుంచి దూసుకుపోయింది. కానూరు దాటింది. ఫోర్డు నురగలు గ్రక్కుతూ పరుగెడుతూంది. ప్రక్కన జనమూ, యితర వాహనాల ఉనికీ మరిచారిద్దరు డ్రైవర్లు. ఒకళ్ళనొకళ్ళు మించాలి! అదే ధ్యేయం. ఎవరెట్లా మన్ను గొట్టుకు పోయినా వాళ్లకు ఖాతరు లేదు.

ఇంతలో లేలేండు ఆగవలసొచ్చింది అంత స్పీడులో ఆకస్మాత్తుగా ఆగడంతో వెనుకనున్న మస్తాన్ ఒక్కసారిగా కుడి ప్రక్కకు త్రిప్పాడు స్టీరింగు. ఎదురుగా రెండెడ్లబండి నిమ్మకు నీరెత్తినట్లు వస్తూంది. యిక తప్పదు. బ్రేక్ వెయ్యవలసిందే! ఆ స్పీడులో బ్రేకు వెయ్యడంతో ఫోర్డు రోడ్డుకడ్డం తిరిగి పక్కకు పల్టీ కొట్టింది. లోని జనం 'చాకలి మూటలోని బట్టల్లాగా' ఒకళ్ళమీదొకళ్ళు పడ్డారు. మొత్తానికి పెద్ద ప్రమాదం ఎవరికీ కాలేదు. కుంటుతూ, మూల్గుతూ అందరూ రకరకాల సైనిక విన్యాసాలు చేయసాగారు. 'అరే! ఆ పరుగెడుతున్న దెవరూ? వరి ఊడ్చిన పొలం గట్టు వెంబడే అలా పరుగెడుతున్నాడెందుకూ? ఎవరో తరుముతున్నట్లు! పిచ్చి సన్యాసి జారిపడ్డాడు పొలంలో! అసలే బురదేమో, వంటినిండా చుట్టుకుంది. తుడుచుకోనుకూడ తుడుచుకోకుండా మళ్లీ పరుగు లంకించుకున్నాడు. మొత్తానికి మంచి స్పోర్ట్సుమన్! అంటూ మెచ్చుకున్నారు ప్రయాణికులు తాత్కాలికంగా!

కానీ డ్రైవరుకు కోటా యివ్వవలసిన సమయ మొచ్చినపుడుగనీ, ఆ పరుగెత్తి పారిపోయింది మస్తానని తెలియలేదు వాళ్లకు. అదృష్టవంతుడు! ●

